క్లుప్తంగా

కరాటేతో ఆత్మరక్షణ



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

జ్యోతినగర్: కరాటేతో ఆత్మరక్షణ కలుగుతుందని విక్టరీ షోటోకాన్ కరాటే ఇండియా వ్యవస్థాపకుడు చీఫ్ ఎగ్జామినర్ రంగు మల్లికార్జున్ గౌడ్ అన్నారు. ఆదివారం ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌లోని తిరుమల వెంకన్న(టీవీ) గార్డెన్స్‌లో విక్టరీ షోటోకాన్ కరాటే ఇండియా ఆధ్వర్యంలో రామగుండం మండల విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్ష నిర్వహించారు. చిన్నారులు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షల్లో నైపుణ్యం, పంచెస్, కిక్స్, బ్యాలన్స్, కంట్రోల్‌పై ప్రదర్శించిన అంశాలను ఆయన అభినందించారు. కోఆర్డినేటర్‌గా సదాశివుడు వ్యవహరించగా, పెద్దపల్లి చీఫ్ ఒడ్డెపల్లి సురేశ్, రామగుండం ఇన్‌స్ట్రక్టర్ ముక్కెర చంద్రశేఖర్, బోయపోతు రాము, ఓర్సు లక్ష్మణ్, సీనియర్ బ్లాక్ బెల్ట్ చెట్టి రమేశ్, సురేశ్ మాస్టర్, ఇష్రత్ బేగ్, నవీన, మహేశ్, రాజశేఖర్, శ్రీజ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాబృందం

ధర్మారం: మండలంలోని మల్లాపూర్‌లో రాష్ట్ర సాంస్కృతిక సారథి కళాబృందం ఆధ్వర్యంలో ఆదివారం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. డ్రగ్స్ తీసుకుంటే ఎలాంటి దుష్పరిణామాలు కలుగుతతాయో వివరించారు. కళాకారులు గుండ్ల స్నేహలత, బుర్ర శంకర్‌గౌడ్, మంథని వెంకటస్వామి, ఢిల్లీ, స్పందన, స్వప్న, శ్వేత పాల్గొన్నారు.

దొంగతుర్తి సమ్మక్క జాతర కమిటీ ఎన్నిక



చంద్రయ్య

ధర్మారం: మండలంలోని దొంగతుర్తి సమ్మక్క–సారలమ్మ జాతర కమిటీ అధ్యక్షుడిగా చొప్పరి చంద్రయ్యను ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పాలకుర్తి సత్యయ్యగౌడ్ ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా సర్పంచు పాలకుర్తి సత్యయ్యగౌడ్, ఉపసర్పంచు ముత్యాల చంద్రశేఖర్, ఎంపీటీసీ దాడి సదయ్య, ఉపాధ్యక్షులుగా జుంజుపల్లి రమేశ్, బాలసాని తిరుపతి, అనుమల్ల సాగర్, వెన్న రమేశ్, గొట్టె మధుకర్, తమ్మడవేని రవి, ప్రధాన కార్యదర్శిగా పుట్ట మల్లేశం, కోశాధికారిగా సంకరి రాజయ్య, కార్యదర్శిగా కొలిపాక లక్ష్మణ్, ప్రచార కార్యదర్శులుగా కొడారి సతీశ్, వేల్పుల రమేశ్, కుంభం లక్ష్మణ్, కలవేని స్వామి, 10మంది కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నట్లు సర్పంచు పేర్కొన్నారు.

బోర్‌వెల్ పనులు ప్రారంభం



జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్‌లో గంగపుత్ర సంఘం ఆవరణలో బోర్‌వెల్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ ఆదివారం ప్రత్యేక పూజ చేసి ప్రారంభించారు. అనంతరం సంఘ సభ్యులు ఆయనను సన్మానించారు. సర్పంచ్ కంకణాల భారతి జ్యోతిబసు, ఉపసర్పంచ్ శ్రీనివాస్, సంఘం అధ్యక్షుడు రాజేందర్, మాజీ సర్పంచ్ సత్యసాగర్, నాయకులు ఆనంద్, తొగరు శ్రీనివాస్ ఉన్నారు.

ఆయన నేత్రాలు సజీవం



యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 18వ డివిజన్ అల్లూరు గ్రామానికి చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు రాదం రాజు అలియాస్ మార్కు స్వామి(68) గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. సదాశయ ఫౌండేషన్ గౌరవ సలహాదారుడు మారెల్లి రాజిరెడ్డి నేత్రదానంపై అవగాహన కల్పించడంతో ఆయన కుటుంబ సభ్యులు స్వామి నేత్రాలను దానం చేయడానికి అంగీకరించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐ టెక్నీషియన్ ఆరిఫ్ నేత్రాలను సేకరించి హైదరాబాద్ వాసన్ ఐ బ్యాంకుకు తరలించారు. సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, కాంగ్రెస్ పెద్దపల్లి వైస్ ప్రెసిడెంట్, మాజీ కార్పొరేటర్ మారెల్లి రాజిరెడ్డి, కాంగ్రెస్ కాలనీ అధ్యక్షుడు గుండేటి రాజేశ్ మృతుడి కుటుంబ సభ్యులను అభినందించారు.

కూచిపూడి కుసుమాలు

- 750 నృత్య ప్రదర్శనలు ఇచ్చిన సంహిత
- నేషనల్ కళారత్న అవార్డు అందుకున్న అశ్రిత
- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ



నేషనల్ కళారత్న అవార్డు అందుకుంటున్న అశ్రిత



వండర్ బుక్ ఆఫ్ రికార్డు అందుకుంటున్న సంహిత

యైటింక్లయిన్‌కాలనీ: కూచిపూడి, జానపద నృత్యాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పాల్గొని సత్తా చాటుతున్నారు యైటింక్లయిన్‌కాలనీకి చెందిన సంహిత, అశ్రిత. 14ఏళ్ల వయసులోనే కూచిపూడి, జానపద నృత్య పోటీల్లో పాల్గొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని 750 ప్రదర్శనలు ఇచ్చి శభాష్ అనిపించుకుంది పుష్పాల సంహిత. 100కుపైగా ప్రదర్శనలు ఇచ్చి 2023లో నేషనల్ కళారత్న అవార్డు అందుకుంది అశ్రిత.

అమ్మే తొలి గురువు



నృత్యం చేస్తున్న సంహిత

సింగరేణి సంస్థలో ఉద్యోగం చేస్తున్న పుష్పాల రవీందర్‌నాథ్–లత దంపతుల ఏకైక కుమార్తె సంహిత నాట్యంలో అద్భుత ప్రతిభ కనబరుస్తోంది. ఏడేళ్ల క్రితం 60 నిమిషాల పాటు నిరంతరాయంగా నృత్య ప్రదర్శన చేసి వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకుంది. హైదరాబాద్‌లో జరిగిన సామూహిక నృత్యపోటీల్లో పాల్గొని గిన్నిస్ బుక్ రికార్డు సాధించింది. మలేసియాలోని కౌలాలంపూర్‌లో జరిగిన సంక్రాంతి సంబరాల్లో ప్రతిభ కనబరిచి నాట్యతార అవార్డు కైవసం చేసుకుంది సంహిత. కూచిపూడి నాట్యం తన తల్లి నుంచి నేర్చుకుంది. అమ్మనే మొదటి గురువుగా చెప్తుంది. గోదావరిఖనిలో కూచిపూడి నృత్య శిక్షకురాలు రంగాజ్యోతి, జానపద డ్యాన్స్ మాస్టర్ ప్రశాంత్ దగ్గర ప్రత్యేక శిక్షణ పొంది రాణిస్తోంది.

నాట్యమయూరి అశ్రిత



నృత్యం చేస్తున్న అశ్రిత

యైటింక్లయిన్‌కాలనీకి చెందిన వెంగళ లక్ష్మణ్–మల్లేశ్వరి దంపతుల కుమార్తె అశ్రిత 9వ తరగతి చదువుతోంది. ఆమెకు కూచిపూడి నాట్యంలో ఉన్న ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు శిక్షణ ఇప్పించారు. అశ్రిత పలు వేదికలపై నాట్యాన్ని ప్రదర్శించి ప్రశంసలతో పాటు అవార్డులు అందుకుంది. జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పలు అవార్డులు సాధించింది. 2023లో నేషనల్ కళారత్న అవార్డు అందుకుంది. ఇప్పటి వరకు 100కుపైగా ప్రదర్శనలు ఇచ్చి అందరి చేత శభాష్ అనిపించుకుంటోంది.

తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు

మాకు నాట్యం అంటే చాలా ఇష్టం. నాట్యం నేర్చుకోవాడానికి అమ్మానాన్నలు ఎంతగానో ప్రోత్సహించారు. విదేశాల్లో నృత్య చేసే అవకాశం కల్పిస్తే మా ప్రతిభతో మరెన్నో అవార్డులు సాధిస్తాం. నృత్య పోటీల్లో మేము విజయం సాధించేలా అద్భుత శిక్షణ ఇచ్చిన గురువులకు రుణపడి ఉంటాం.

– సంహిత, అశ్రిత

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



ఎలిగేడు: సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

ఎలిగేడు: రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో ఎమ్మెల్సీ భానుప్రసాదరావు, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావుతో కలిసి రూ.22లక్షలతో నిర్మించిన రైతువేదిక, రూ.3.4లక్షలతో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్డు, రూ.12.6లక్షలతో నిర్మించిన వైకుంఠధామం, రూ.20లక్షలతో నిర్మించిన దుకాణ సముదాయం, రూ.36లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనం, పాఠకుల రీడింగ్ రూమ్‌లను మంత్రి ఆదివారం ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. గత ప్రభుత్వం రూపొందించిన మంచి పాలసీలను తప్పనిసరిగా కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగానే ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామన్నారు. జిల్లాలో రైతులు లాభదాయక ఆయిల్‌పామ్ పంటల సాగు దిశగా దృష్టి సారించేలా అధికారులు కృషిచేయాలని సూచించారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీని పంచాయతీ పాలకవర్గం సన్మానించింది. అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, జిల్లా ఉపాధి అధికారి తిరుపతిరావు, జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ మండిగ రేణుక, ఎంపీపీ తానిపర్తి స్రవంతి, సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, ఉపసర్పంచ్ ఆకుల హరీశ్‌గౌడ్, సింగిల్‌విండో చైర్మన్ గోవు విజయభాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ స్వర్ణ, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎంపీవో అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి నివాళి

జ్యోతినగర్: మంత్రి శ్రీధర్‌బాబుకు, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్‌కు కాంగ్రెస్ శ్రేణులు స్వాగతం పలికారు. ఆదివారం ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌లో పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఆసిఫ్ పాషా ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్పొరేటర్ కొలిపాక సుజాత, ఈదునూరి రవి, మడిపెల్లి మల్లేశ్, రమేశ్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం

పాలకుర్తి: గడిచిన పదేళ్లలో అధికారంలో కొనసాగిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ నిమిత్తం గోదావరిఖనికి వెళ్తున్న మంత్రి శ్రీధర్‌బాబుకు పాలకుర్తి మండల పరిధిలోని కన్నాల, జీడీనగర్, బసంత్‌నగర్ బస్టాండ్ వద్ద రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. కన్నాల సింగిల్‌విండో చైర్మన్ బయ్యపు మనోహర్‌రెడ్డి, జీడీనగర్ సర్పంచ్ సూర సమ్మయ్య, జయ్యారం ఎంపీటీసీ గంగాధర రమేశ్, పార్టీ మండలాధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్, నాయకులు పర్శవేని శ్రీనివాస్, వేల్పుల రాజుకుమార్, పాత రవీందర్, దేవనందుల రాజమౌళి, సూర సంతోష్, వాసుదేవరావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

పెద్దపల్లిరూరల్: మండలంలోని కుర్మపల్లి గ్రామంలో సర్పంచ్ మామిడిపల్లి బాపయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం మంత్రి శ్రీధర్‌బాబు ఆవిష్కరించారు. అంబేడ్కర్ ఆశయసాధనకు పాటుపడాలన్నారు. ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్ ఉన్నారు.

మంత్రికి స్వాగతం

గోదావరిఖని: మంత్రి శ్రీధర్‌బాబుకు ఆదివారం రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించి మొదటిసారిగా గోదావరిఖనికి వచ్చిన సందర్భంగా స్థానిక బీపవర్‌హౌస్ గడ్డ నుంచి గోదావరిఖని వరకు కార్యకర్తలు స్వాగతం పలికారు.

పొంగుతున్న ప్రధాన డ్రైనేజీ



రామగుండం: పట్టణంలోని ప్రధాన రహదారిలో ఉన్న డ్రైనేజీలో మురుగు నీరు పొంగి ఇళ్ల ముందు చేరుతోంది. అలాగే అంతర్గత కాలనీల నుంచి వచ్చే మురికినీరు ప్రధాన డ్రైనేజీలోకి చేరి రోడ్డుమీద ప్రవహిస్తుండటంతో దుర్వాసన, దోమల బెడదతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు దశాబ్దాలుగా ఎంతో మంది పాలకులు మారినా ప్రధాన డ్రైనేజీ నిర్మాణానికి మోక్షం కలగడం లేదని, ఎమ్మెల్యే డ్రైనేజీ నిర్మాణానికి నిధులు కేటాయించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

బట్టీ యజమానుల నిర్లక్ష్యం



ఇటుక బట్టీలో పోసిన బూడిద, ఊక కుప్పలు

సుల్తానాబాద్‌రూరల్: ఇటుక బట్టీల యజమానులు నిబంధనలు తుంగలో తొక్కి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సుల్తానాబాద్ మండలంలోని ఇటుక బట్టీల యజమానులు వారి బట్టీల్లో డంపు చేసుకున్న బూడిద, ఊక కుప్పలపై ఎలాంటి కవర్, ఎండుగడ్డి కప్పకపోవడంతో గాలికి లేచి రోడ్డుపై వెళ్తున్న వాహనాదారుల కంట్లో పడుతోంది. దీంతో వారు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారు. వీరి నిర్లక్ష్యం ఎదుటివారికి శాపంగా మారింది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

కాంగ్రెస్ శ్రేణుల బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో కాంగ్రెస్ శ్రేణులు

ఎలిగేడు: సుల్తాన్‌పూర్‌లో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు వచ్చిన మంత్రి శ్రీధర్‌బాబు, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావుకు యూత్ కాంగ్రెస్ జాతీయ మాజీ కార్యదర్శి ఊట్ల వరప్రసాద్ ఆధ్వర్యంలో గర్రెపల్లిలో ఘన స్వాగతం పలికారు. గర్రెపల్లి నుంచి సుల్తాన్‌పూర్ వరకు ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ధర్మారం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 2007–08లో పదో తరగతి చదివిన విద్యార్థులు 60మంది ఈ వేడుకకు హాజరయ్యారు. తమకు చదువు చెప్పిన గురువులను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు.

ప్రణాళికాబద్ధంగా పల్లెలను అభివృద్ధి చేస్తా



విప్ లక్ష్మణ్‌కుమార్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావుకు గజమాలతో సత్కారం

పెద్దపల్లిరూరల్: పల్లెలను పట్టణాలకు దీటుగా ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. పెద్దపల్లి మండలం కాపులపల్లిలో నిర్మించిన పంచాయతీ భవనాన్ని ఆదివారం ఆయన ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోవుకవిత, ఎంపీటీసీ ఎడెల్లి శంకర్, శ్రీనివాస్ తదితరులు వారిని గజమాలతో సత్కరించారు. ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం అనేక పథకాలకు రూపకల్పన చేస్తోందన్నారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులు

ఓదెల: అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్టీపీసీ జ్యోతినగర్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీల్లో మండలంలోని కనగర్తి, కొలనూర్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సిల్వర్, బంగారు పథకాలు కై వసం చేసుకున్నారు. బాలుర విభాగంలో కనగర్తికి చెందిన అజయ్‌కుమార్ 4 బంగారు పథకాలు, లాంగ్‌జంప్‌లో దాసు జయశ్రీ, షాట్‌పుట్‌లో పెర్క హర్షిత సిల్వర్ పథకాలు సాధించారు. షాట్‌పుట్‌లో ఆర్.సుషిత్, ఆర్.సౌమ్య (కొలనూర్) బంగారు పథకాలు పొందారు. అండర్–12లో కొలనూర్‌కు చెందిన కె.కీర్తన, అక్షిత, హర్షిత్ బంగారు పథకాలు, అండర్–14లో వరుణ్‌తేజ్ సిల్వర్ పథకం కైవసం చేసుకున్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ఓదెల ఎంఈవో ఆరెపల్లి రాజన్న, హెచ్‌ఎం యేసుదాస్, పీఈటీలు ప్రణయ్‌కుమార్, విష్ణు అభినందించారు.

పంచాయతీ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఆపరేటర్లు

జూలపల్లి: జిల్లావ్యాప్తంగా గ్రామపంచాయతీల్లో చాలీచాలని వేతనంతో పనిచేస్తున్న 1619 మంది పంచాయతీ ఆపరేటర్లకు, 32 మంది ప్రాజెక్టు మేనేజర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ పంచాయతీ ఆపరేటర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ ఎండీ రజాక్, ఆపరేటర్లు తిరుపతిరెడ్డి, శ్రీకాంత్, సురేశ్, కుమార్ పాల్గొన్నారు.

చెరువు నీటిలో ‘చెత్త’



చెరువులో పిచ్చిమొక్కలు, నాచు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని ఎల్లమ్మ, గుండమ్మ చెరువులో పిచ్చి మొక్కలు, చెత్త పేరుకుపోతోంది. ఈ చెరువులో మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రజలకు బోటింగ్ సౌకర్యం అందుబాటులోకి తెచ్చారు. నీటిలో పెరుగుతున్న పిచ్చిమొక్కలు, తీగజాతిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

పంచాయతీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



కోదండరాంను కలిసి వినతిపత్రం అందిస్తున్న వెంకటేశ్

సుల్తానాబాద్: గ్రామపంచాయతీలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీ కోదండరాంను కలిసి విన్నవించారు. ఆదివారం హుజూరాబాద్‌కు ఎమ్మెల్సీ కోదండరాం రావడంతో ఆయనను కలిసి వినతి పత్రం అందజేసి సన్మానించారు. గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని విన్నవించారు. గ్రామ పంచాయతీలో పనిచేసిన పలు ఉద్యోగులకు జీతాలు సకాలంలో ఇచ్చేలా చూడాలని కోరారు. గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి జొన్నకోటి వెంకటేశ్, రాష్ట్ర కోశాధికారి పిల్లి రవి, సంయుక్త కార్యదర్శి సురేందర్ పాల్గొన్నారు.

రామగుండం సీఐగా టి.ప్రవీణ్‌కుమార్



జ్యోతినగర్: రామగుండం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా టి.ప్రవీణ్‌కుమార్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆదివారం రామగుండం సర్కిల్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఎన్టీపీసీ ఎస్సై బి.జీవన్, పలువురు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

ఘనంగా ఉర్సు ఉత్సవాలు

గోదావరిఖనిటౌన్: తాజొద్దీన్ బాబా ఉర్సు ఉత్సవాలు ఆదివారం స్థానిక కాకతీయనగర్‌లోని దర్బార్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి, పుణ్యవచన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దర్బార్ నిర్వాహకులు నారదాసు సతీశ్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.